క్లుప్తంగా

7న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం కొండ ప్రాంతంలో వేం చేసిన శ్రీ స్వయంబు శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం 7వ తేదీన నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకులు తొత్తడి నాగరాజు పేర్కొన్నారు. స్వామి వారికి సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, మహాభిషేకం అనంతరం లక్ష్మీగణపతి హోమం, సుబ్రహ్మణ్య స్వామి మూలమంత్ర హవనం జరుగుతాయి. 10 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించడం, వర పూజ అనంతరం కల్యాణోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం స్వామి వారి అన్న ప్రసాద వితరణ, సాయంత్రం ఊరేగింపు, పవళింపు సేవతో ఉత్సవం ముగియనుంది.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి



బస్టాండ్(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ప్రజారవాణా సంస్థలో బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడికి ఏపీపీటీడీ(ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. విజయవాడ జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అయనను మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ నాయకులు బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గతంలో ఉన్న జాయింట్ మీటింగ్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. దీనికి అయన సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భరణి, జానకిరామ్, వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో తెలంగాణ అధికారుల బృందం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తెలంగాణకు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులు సోమవారం దర్శించుకున్నారు. తెలంగాణా చీఫ్ సెక్రటరీ ఎ.శాంతికుమారి, ఐఏఎస్ అధికారి వి. శేషగిరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

ఆర్చరీ పోటీల్లో విజయవాడ క్రీడాకారుల సత్తా



విజయవాడస్పోర్ట్స్: ట్రెడిషనల్ ఆర్చరీ జాతీయ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు సత్తా చాటారు. తమిళనాడులోని దిండిగుల్‌లో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన ఈ పోటీలకు సిరిగి సురేష్, ప్రశాంత్, అద్విత రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించారు. సీనియర్స్ పురుషుల విభాగంలో సిరిగి సురేష్, అండర్-7 బాలుర విభాగంలో ప్రశాంత్, బాలికల విభాగంలో అద్విత బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ప్రతిష్టాత్మకమైన జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ ట్రెడిషనల్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు అభినందించారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి మరిన్ని పతకాలు తీసుకొచ్చేలా రాష్ట్ర క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గన్నవరానికి చెందిన ప్రతిన్ కూచిపూడి నాట్య అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్య అకాడమీకి చెందిన దివిజ సాయి, జోస్న, లాస్య, భావన, ఎస్ఎస్వి. కీర్తన, కస్తూరి, ఓస్న, చరణ్యలతో పాటు మరి కొంత మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమానికి ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

చిట్టినగర్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- ఫ్రీ లెఫ్ట్ టర్న్‌కు కనిపించని మార్గం
- పని చేయని సిగ్నల్
- ఉదయం, సాయంత్రం వేళ వాహన దారులకు చుక్కలే



చిట్టినగర్‌లో అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు



కేటీ రోడ్డులో పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్



ఫ్రీ లెఫ్ట్‌లో ఇష్టానుసారంగా పార్కింగ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ జంక్షన్‌లో అస్తవ్యస్తమైన ట్రాఫిక్‌తో వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పశ్చిమ నియోజక వర్గంలోని అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన చిట్టినగర్ జంక్షన్ దాటడమంటే ఓ పెద్ద యుద్ధమే. ప్రతి నిత్యం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు చిట్టినగర్ జంక్షన్‌లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ కనిపిస్తుంది. ఎవరికి వారు బిజీ జీవితంలో మేం ముందు వెళ్లాలంటే మేం ముందు వెళ్లాలనే ఆతృత... కంగారు.. వారి వాహనాలను ముందుకు దూకిస్తుంటారు. పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్, సరిపడినంత మంది ట్రాఫిక్ పోలీసులు చిట్టినగర్ సెంటల్‌లో లేకపోవడంతో నిత్యం ఇక్కడ ఓ పద్మవ్యూహమే. ఇక కుమ్మరి పాలెం, కబేళా ప్రాంతాల్లో ఏ మాత్రం ట్రాఫిక్ అంతరాయం కలిగినా ఆ ప్రభావం చిట్టినగర్ సెంటర్‌పై కనిపిస్తుంది. ఆ సమయంలో చిట్టినగర్ సెంటర్‌ను దాటాలంటే కనీసం పావుగంట పాటు వేచి ఉండాల్సిందే... పశ్చిమ నియోజక వర్గంలోని వన్‌టౌన్, పంజా సెంటర్, పాల ప్రాజెక్టు వైపు నివసించే ప్రజలు భవానీపురం, గట్టు వెనుక ప్రాంతాలకు వెళ్లాలంటే చిట్టినగర్ సెంటర్‌ను దాటాల్సిందే. అంతటి ప్రాదాన్యత ఉన్న చిట్టినగర్ సెంటర్‌లో రోజు రోజుకు పెరుగుతున్న ఆక్రమణలు, పని చేయని సిగ్నల్స్‌తో వాహన చోదకులకు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఏళ్ల తరబడి పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్....

చిట్టినగర్ సెంటర్‌లో ఏళ్ల తరబడి ట్రాఫిక్ సిగ్నల్ పని చేయడం లేదు. నగరంలోని ప్రధాన కూడళ్లతో పాటు చిన్న చిన్న కూడళ్లలో సైతం కనిపించే ట్రాఫిక్ సిగ్నల్స్ నియోజక వర్గంలోని అత్యంత కీలకమైన చిట్టినగర్ సెంటర్‌లో కనిపించకపోవడం శోచనీయం. వాస్తవానికి సెంటర్‌లోని నాలుగు మార్గాల్లో రెండు మార్గాలలోనే ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండగా, మరో రెండు రోడ్లపై అసలు ట్రాఫిక్ సిగ్నల్స్ కనిపించడం లేదు. కేటీ రోడ్డు నుంచి చిట్టినగర్‌కు వచ్చే ప్రధాన మార్గంలో ట్రాఫిక్ సిగ్నల్ కనిపిస్తాయి. సొరంగం రోడ్డు నుంచి చిట్టినగర్‌కు వచ్చే క్రమంలో సిగ్నల్స్ కనిపిస్తుండగా, ఎర్రకట్ట రోడ్డు, సాయిరాం వైపు నుంచి రోడ్డులో అసలు ట్రాఫిక్ సిగ్నల్స్ కనిపించవు. దీంతో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ముందు వెళ్లాలనే క్రమంలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఇద్దరు విధులు నిర్వహిస్తున్నా వారు వాహనాల రాకపోకలను నియంత్రించడం లోనే సరిపోతుంది.

కనిపించని ఫ్రీ లెఫ్ట్ టర్న్‌కు మార్గం...

చిట్టినగర్ సెంటర్‌ను దాటడమంటే ఓ యుద్ధమే అనే బావన వాహన చోదకుల్లో కలుగుతుంది. కేటీ రోడ్డు నుంచి సొరంగం రోడ్డులోకి వెళ్లాలన్నా... సొరంగం రోడ్డులో నుంచి సాయిరాం వైపు వెళ్లాలన్నా, ఎర్రకట్ట రోడ్డు నుంచి కేటీరోడ్డు వైపు తిరగాలన్నా.. కనీసం ఫ్రీ లెఫ్ట్ మార్గం కనిపించదు. రోడ్డుకు ఎడమ వైపు ఉన్న టీ, టిఫిన్ స్టాల్స్ ముందు ఇష్టానుసారంగా వాహనాలను నిలుపుదల చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాదారణంగా రోడ్డుపై ఒక ఐదు నిమిషాలు బైక్ నిలిపితేనే ఒప్పుకోని ట్రాఫిక్ పోలీసు సిబ్బంది.. అంత పెద్ద సెంటర్‌లో రోడ్డుకు ఎడమ వైపు ఇష్టానుసారంగా వాహనాలు నిలిపితే ఎందుకు స్పందంచరని ప్రశ్నిస్తున్నారు.

రాజ్‌కుమార్ సామాజిక సేవలు చిరస్మరణీయం



రాజ్‌కుమార్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న పీజీ విద్యార్థి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిమ్రా మెడికల్ కళాశాలలో కళాశాల పీజీ విద్యార్థి, భవానీపురానికి చెందిన డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్ సంస్మరణ సభ సోమవారం జరిగింది. కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంస్మరణ సభలో పలువురు ప్రొఫెసర్లు, డాక్టర్ రాజ్‌కుమార్ సహచర పీజీ విద్యార్థులు పాల్గొని ఆయన చేసిన సామాజిక సేవలను గుర్తు చేసుకున్నారు. పేద రోగుల పట్ల ఆయన ఎంతో సానుభూతితో వ్యవహరించేవారని పేర్కొన్నారు. గతంలో కోవిడ్ సమయంలోను, ఇటీవల సంభవించిన బుడమేరు వరద సమయంలోను తన స్నేహితులతో కలిసి చేసిన సామాజిక సేవలను స్మరించుకున్నారు. డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్ చిన్న వయసులోనే అకాల మరణం చెందటం తమను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. సమాజం పట్ల బాధ్యత, సేవా దృక్పథం కలిగిన రాజ్‌కుమార్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళతామని తెలిపారు. ఆయన మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియ చేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు 'అంబాసిడర్లు'

- సమాచారం ఇచ్చి.. సమస్య పరిష్కారానికి సహకరించడమే వారి విధి
- ట్రాఫిక్ అంబాసిడర్‌ల సమావేశంలో పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు



ట్రాఫిక్ అంబాసిడర్‌ల సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: నగరంలో రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించే దిశగా పోలీస్ కమిషనరేట్ చర్యలు తీసుకుంటుందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అన్నారు. ఇప్పటికే వినూత్నంగా లైవ్ డ్రోన్ కెమెరాలు, అస్త్రం యాప్ ద్వారా ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. అయితే జంక్షన్స్ వద్ద త్వరితగతిన ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు, రవాణా సులభతరం చేసేందుకు స్థానిక వ్యక్తులను ట్రాఫిక్ అంబాసిడర్‌లుగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బెంజిసర్కిల్ సమీపంలోని జ్యోతి కన్వెన్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రాఫిక్ అంబాసిడర్‌లకు కమిషనర్ దిశానిర్దేశం చేశారు.

ట్రాఫిక్ అంబాసిడర్లు వీరే..

నగరంలో నివసించే పలు వృత్తుల వారిని వారి అనుమతితోనే ట్రాఫిక్ అంబాసిడర్‌లు తీసుకున్నామని సీపీ చెప్పారు. వారి మొబైల్ నంబర్‌లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామని, ఈ వాట్సాప్ గ్రూప్ కమాండ్ కంట్రోల్ రూంనకు అనుసంధానమై ఉంటుందన్నారు.

అంబాసిడర్లు ఏం చేస్తారంటే..

ట్రాఫిక్ స్తంభించినపుడు ఫొటో తీసి పంపాలని, లేదంటే మెసేజ్ చేయాలని అంబాసిడర్‌లకు సీపీ సూచించారు. ఏదైనా వాహనం బ్రేక్ డౌన్ అయినా.., రోడ్డు ప్రమాదం జరిగినా, ధర్నా, ర్యాలీ, ఊరేగింపులు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు స్పందించి వెంటనే వాట్సాప్‌లో సమాచారం పంపితే.. అందుబాటులోఉన్న సంబంధిత ట్రాఫిక్ అధికారులను అప్రమత్తం చేసి సత్వరమే ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించి ప్రజలకు కలిగిన అసౌకర్యాన్ని నివారిస్తామన్నారు. అత్యవసర చికిత్స అవసరమైన వారి ప్రాణాలు కాపాడటంలో, అత్యవసర పని మీద వెళ్లేవారు సకాలంలో వారి గమ్యస్థానాలకు చేరుకోవడానికి సామాజిక బాధ్యతగా సాయమందించాలని అంబాసిడర్‌లను కోరారు. చిన్న సమాచారం ఇచ్చి ట్రాఫిక్ అంతరాయం లేని నగరంగా విజయవాడను తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీపీలు గౌతమీ సాలి, కృష్ణమూర్తినాయుడు, తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీలు ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్, జి.రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర లింగార్చన



స్వామి వారికి విశేష అలంకరణ



సహస్ర లింగార్చనలో పాల్గొన్న ఈవో రామరావు దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో సోమవారం సహస్ర లింగార్చన వైభవంగా జరిగింది. ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించిన సహస్ర లింగార్చనను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ జరగగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు పూజలో పాల్గొన్నారు. పవిత్ర కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పోలిని స్వర్గానికి పంపిన అనంతరం మల్లేశ్వర స్వామి వారి సన్నిధికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

అధునాతన టెక్నాలజీని వినియోగించాలి



ఇండోర్‌లో వ్యర్థాల నిర్వహణ తీరు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర బృందం

పటమట(విజయవాడతూర్పు): వ్యర్థ నిర్వాహణలో విజయవాడలో అగ్రస్థానంలో నిలిచేలా తాము కృషి చేస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. విజయవాడను స్వచ్ఛతలో ముందడుగులో ఉంచేందుకు గత ఏడు సంవత్సరాలుగా స్వచ్ఛ సర్వేక్షణలో మొదటి స్థానంలో ఉన్న ఇండోర్ నగరంలో ఆయన వీఎంసీ అధికారులతో కలిసి పర్యటించామని తెలిపారు. ఇండోర్ నగరంలో అమలు చేస్తున్న వ్యర్థపదార్థాల నిర్వహణను అధికారులతో పరిశీలించామని, వాళ్ళు అమలు చేస్తున్న ఇంటి వద్దనే వ్యర్థాలను వేరు చేసే విధానం, వాడుతున్న వ్యర్థ సేకరణ వాహనాలు, వాటికున్న జీపీఎస్ మెకానిజం, చెత్త సేకరణ రూటు మారితే జీపీఎస్‌లో గమనించిన కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను అప్రమత్తం చేయటం, ఎంఆర్ఎఫ్ ప్లాంట్, వ్యర్థ నిర్వహణలో ఉపయోగించే టెక్నాలజీ, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ కూడా ఇండోర్‌తో పాటు దీటుగా వ్యర్థాల నిర్వహణలో టెక్నాలజీ వినియోగిస్తుందని తెలిపారు. అయితే మరింత సాంకేతికను అందిపుచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందుకు తగిన విధంగా తాము నూతన సంస్కరణలను చేపట్టనున్నామన్నారు. ఈ పర్యటనలో సూపరిండెంటింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పి. సత్యకుమారి, ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెహికల్ డిపో ఏసు పాదం పాల్గొన్నారన్నారు.

ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని ధర్నా

- స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచనలను ఉపసంహరించుకోవాలి
- సీపీఎం డిమాండ్



ప్రజలపై విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసి అదానీని అరెస్ట్ చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాణిగారితోటలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమీషన్ (ఈఆర్సి) పేరుతో దాదాపుగా రూ.15.50 వేల కోట్ల విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రజలపై మోపుతుందన్నారు. ఇప్పటికే రూ.6072 కోట్ల భారాన్ని మోపిన ప్రభుత్వం మరో రూ.9412 కోట్ల జనవరి నుంచి వసూళ్లు చేసేందుకు సిద్ధపడుతుందని మండిపడ్డారు. గత ప్రభుత్వంపై నెపం నెట్టి దానిని చూపించి ప్రజల నెత్తిన వేల కోట్లు భారాలు వేయడం దుర్మార్గమని తెలిపారు. హామీలను నమ్మి అందలం ఎక్కిస్తే ప్రజలకు మీరేమి వెలగబెడుతున్నారని సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో రూ.20వేల కోట్లు భారాలు వేస్తే బాదుడే బాదుడు అని పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించి ఇప్పుడు ఐదు నెలల్లోనే రూ.15వేల కోట్ల భారాలు మోపిన మీది ఏ రకమైన బాదుడో చెప్పాలన్నారు. తక్షణమే పెంచిన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఎం నగర నాయకులు చంద్రశేఖర్, డి.వరప్రసాద్, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్మెంటెడ్ టెక్నాలజీతో మోకీళ్ల మార్పిడి

రాష్ట్రంలోనే తొలిసారిగా ఎంజే నాయుడు ఆస్పత్రిలో నిర్వహణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎంజే నాయుడు, పక్కన వంశీ, రవితేజ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సల్లో సరికొత్త అధ్యాయానికి విజయవాడ నగర వైద్యులు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకూ రోబోటిక్ సర్జరీలు నిర్వహిస్తుండగా, రాష్ట్రంలోనే తొలిసారిగా డాక్టర్ ఎంజే నాయుడు ఆస్పత్రిలో అగ్మెంటెడ్ రియాలజీ టెక్నాలజీతో మోకీళ్ల మార్పిడి విజయవంతంగా చేసినట్లు డాక్టర్ ఎంజేనాయుడు, డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. సూర్యారావుపేటలోని తమ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు తెలిపారు. కృష్ణాజిల్లా గంగూరుకు చెందిన 56 ఏళ్ల మహిళ రెండు మోకీళ్లు అరిగి నడవలేని స్థితిలో ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. ఆమెకు పరీక్షలు నిర్వహించగా స్టేజ్ 4 దశకు చేరినట్లు నిర్ధారించారు. ఆమె మోకీళ్ళు పూర్తిగా అరిగి పోవడంతో అగ్మెంటెడ్ రియాలిటీ టెక్నాలజీతో అతి తక్కువ వ్యవధిలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ ఎంజే నాయుడు తెలిపారు. గతంలో రోబోటిక్ సర్జరీలతో సత్ఫలితాలు సాధిస్తే, మారుతున్న కాలానికి అనుగుణంగా శస్త్ర చికిత్సల్లో కూడా మార్పులు వచ్చినట్లు తెలిపారు. ఆగ్మెంటెడ్ రియాలటీ టెక్నాలజీతో కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స త్వరగా పూర్తి చేయవచ్చునన్నారు. ఒకరోజు వ్యవధిలోనే రోగి నడవగలుగుతుందన్నారు. నొప్పి కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ తరహా సర్జరీతో జాయింట్ జీవితకాలం పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్థోపెడిక్ వైద్యులు రవితేజ రఘురామ్, ఎనస్థీషియన్ రవికుమార్‌లు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డాక్టర్ డి. చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరించే దిశగా అధికారులు నిరంతరం కృషి చేయాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో నగర వాసుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను స్వయంగా అధికారుకు విన్నవించుకునే ఈ కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకూడదని చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో వీఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొత్తం 10 ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగంపైన్, ఇంజినీరింగ్‌పై- 2, ప్రజారోగ్యం పై-1, రెవెన్యూ విభాగంపై-1, ఉద్యానవన విభాగంపై-1 ఫిర్యాదులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎస్ఈ పి.సత్యనారాయణ, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) నారాయణ, డీఎఫ్ఓ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలి కాంతులు.. ఆధ్యాత్మిక సౌరభాలు







సూర్యోదయ వేళ కృష్ణమ్మ కార్తిక దీపకాంతులతో మెరిసిపోయింది. నారికేళ పంచామృత అభిషేకాలతో శివయ్య పొంగిపోయాడు. లక్ష బిల్వదళ అర్చనలతో మురిసిపోయాడు. ఆలయాలు భక్తజనంతో నిండుగా కనిపించాయి. అంతటా ఓంకార మంత్రం ప్రతిధ్వనించింది. లయకారుడి ప్రీతిపాత్రమైన కార్తిక మాసం చివరి రోజు సోమవారం జిల్లాలోని శైవాలయాలు శశిశేఖరుని నామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామునే భక్తులు కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధనలు చేశారు. విజయవాడ దుర్గా ఘాట్లో దీపాలు వదులుతున్న భక్తులను చిత్రంలో చూడొచ్చు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

5 నుంచి సంగీత ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు జయంతి ఉత్సవాల సందర్భంగా స్వరఝరి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో 5 వ తేదీ నుంచి 9 వరకు సంగీత ఉత్సవాలు నిర్వహిస్తునట్లు సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివరామ కృష్ణ క్షేత్రంలో జరిగే ఉత్సవాల్లో తొలి రోజు కె.సుధీర్ శర్మ (ఆస్ట్రేలియా), 6న కమల దీప్తి (చెన్నై), 7న సాతూర్ కృష్ణరామ రత్నం, 8న మోదుమూడి సుధాకర్, 9న అన్నవరపు రామస్వామి (వయోలిన్) సంగీత కచేరీలు నిర్వహిస్తారన్నారు.